ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్

విశ్వంభర, మహబూబాబాద్: సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్ అన్ని విభాగాల జిల్లా అధికారులు, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, క్రిష్ణవేణి లతో అదేవిధంగా మండల అధికారులతో గూగుల్ మీట్ ద్వారా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చిన దరఖాస్తుదారులతో కలెక్టర్ స్వయంగా ఫిర్యాదులు తీసుకొని వారి వినతులను సవివరంగా విని సంబంధిత విభాగాల అధికారులకు వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పెండింగ్ ఫైళ్లను, ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి తక్షణమే క్లియర్ చేయాలని, కార్యాలయాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు జవాబుదారీ తనంగా ఉంటూ సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన వసతి గృహాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పిల్లలతో కలిసి బ్రేక్ ఫాస్ట్ ,భోజనం, డిన్నర్ చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం కు చెందిన గుండ్ల ఉపేందర్ తాను ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూమి వేరొకరి పేరు మీద పట్టా మార్పు జరిగిందని అట్టి భూమి తిరిగి తన పేరు మేరు మీద మార్పు చేసి పట్టా పాసు పుస్తకము ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. గంగారం మండలం దుబ్బగూడెం గ్రామానికి చెందిన గ్రామస్తులు స్తానికంగా ఉన్న ఫర్టిలైజర్ దుకాణ యజమానులు ఎరువులను ఎక్కువ ధరలకు అమ్ముతున్నారని, అదేవిధంగా తమ గ్రామానికి కేటాయించిన మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని వేరే గ్రామానికి తరలించారని తమపై అధిక వడ్డీ వ్యాపారం చేస్తున్నారని, మొక్క జొన్న తక్కువ ధరకు కొనుగోలు చేసి చెల్లిస్తున్నారని అట్టి ఫర్టిలైజర్ యజమానులపై చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. గార్ల మండలం బాలాజీ తండ కు చెందిన సరోజ తనకు గతంలో ఇందిరమ్మ ఇల్లు వచ్చినట్లు రికార్డులో చూపిస్తుందని కానీ ఇప్పటివరకు తనకు ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ కాలేదని రికార్డులను పరిశీలించి తనకు ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా న్యాయం చేయాలని కోరారు. సీరోలు మండలం సీత్లా తండ గ్రామ పంచాయతీ అందనాల వీడు కు చెందిన అంగోతు లచ్చు తనకున్న 2.20 ఎకరాలకు 2024 సంవత్సరము నుండి ఇప్పటివరకు తన ఖాతాలో రైతు భరోసా డబ్బులు జమ అవట్లేవని పరిశీలించి తనకు రైతు భరోసా డబ్బులు ఇప్పించగలరని కోరారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి లో వచ్చిన 168 దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జడ్పీ సీఈవో పురుషోత్తం, అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో డిజిటల్ మోసాలను అధిగమించండి

విశ్వంభర, సంగారెడ్డి : సైబర్ నేరాలను నివారించడానికి అవసరమైన జ్ఞానాన్ని సమకూర్చుకుని, అవగాహనతో డిజిటల్ మోసాలని అధిగమించాలని హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ విద్యార్థులకు సైబర్ నిపుణులు సూచించారు. సైబర్ భద్రతపై మరింత అవగాహనను సమాజంలో వ్యాప్తిచేయగల బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరులుగా ఎదగాలని అభిలషించారు. 'సైబర్ అవగాహన, చైతన్య సదస్సు'ను సోమవారం నిర్వహించారు. దీనిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, న్యూఢిల్లీకి చెందిన ఇండియా ఫ్యూచర్ ఫౌండేషన్ (ఐఎఫ్ఎఫ్), సైబరాబాదుకు చెందిన సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ స్వల్ప వ్యవధి శిక్షణ కార్యక్రమంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ ఎస్. వి.హరికృష్ణ, సంగారెడ్డి డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఎస్సీఎస్సీకి చెందిన రష్మి శ్రీవాస్తవ, ఇండియా ఫ్యూచర్ ఫౌండేషన్ (ఐఎఫ్ఎఫ్)కు చెందిన శాలిని రాథోర్, శిఖర్ ద్వివేది వంటి నిపుణులు పాల్గొని, సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

చేనేత కళకు ఢిల్లీలో గౌరవం

చేనేత ప్రదర్శనలో పాల్గొన్న జాతీయ అవార్డు గ్రహీత ఆనంద నాగరాజు

విశ్వంభర, హైదరాబాద్ : ఢిల్లీలో జరిగిన 'టీఈహెచ్ బజార్' ఎగ్జిబిషన్ లో ఆనంద నాగరాజు తెలంగాణ చేనేత కళా వైభవం చాటిచెప్పారు. పుట్టపాక గ్రామానికి చెందిన జాతీయ అవార్డు గ్రహీత ఆనంద నాగరాజు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రసిద్ధ తేలియా రుమాల్ తో పాటు సింగిల్, డబుల్ ఇక్కత్ వస్త్రాలను ఆయన ప్రదర్శించారు. మన సంప్రదాయ కళకు ఢిల్లీ వేదికగా దక్కిన ఈ గౌరవంపై చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా చేనేత వస్త్రాలకు మంచి ఆదరణ ఉందని , ప్రతిఒక్కరు చేనేత వస్త్రాలను ధరించి చేనేత కళాకారులకు చేయూతను అందించాలని ఆయన కోరారు.

సాంస్కృతిక ప్రదర్శనలతో మెరిసిన గ్రాడ్యుయేషన్ డే

విశ్వంభర, షాబాద్ : రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం నాగర్ గూడ శ్రీ చైతన్య హైస్కూల్లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకలు విద్యార్థుల ప్రతిభకు వేదికగా నిలిచాయి. కరస్పాండెంట్ ప్రసాద్ సిద్దాపురం, శిరీష ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాటలు, నృత్యాలు, వివిధ ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. పెద్ద సంఖ్యలో హాజరైన తల్లిదండ్రులు విద్యార్థుల ప్రతిభను చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో చదివితేనే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు. ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ముందంజలో ఉన్నాయని చెప్పారు. గత 18 సంవత్సరాలుగా నిరంతర కృషితో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీరాములు, డైరెక్టర్ సుశాంత్, ఇన్‌చార్జ్ రాజనరేందర్, మధు, అజయ్, సఫియా, అపర్ణ, సునంద, మాధవి, ప్రభావతి, అనురాధ, ప్రవీణ్, పావని, శిల్పా, నేహా, కీర్తన, సంతోష, అరుణ, సునీత, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల బ్లాక్ దందా.. ముఠా అరెస్టు

విశ్వంభర, హైదరాబాద్: బహిరంగ మార్కెట్‌లో గ్యాస్ సిలిండర్ల బ్లాక్ దందా చేస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ముఠాగా ఏర్పడి కమర్షియల్ గ్యాస్‌ను అక్రమంగా మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. హోటళ్లు, రెస్టారంట్‌లకు అధిక ధరలకు గ్యాస్ విక్రయిస్తున్నట్లు కనిపెట్టారు. డీలర్‌తోపాటు 10 మందిని అరెస్టు చేశారు. కేసు వివరాలను టాస్క్‌ఫోర్స్ డీసీపీ రఘునాథ్ మీడియాకు వెల్లడించారు. పంజాగుట్టలోని శ్మశాన వాటికలో సిలిండర్లు నిల్వ చేసినట్లు చెప్పారు. ''మొత్తం 414 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నాం. ఏడాదిన్నరగా ఈ బ్లాక్ మార్కెట్ దందా కొనసాగిస్తున్నారు. గ్యాస్ కొరత ఉన్నట్లు నిందితులు వదంతులు సృష్టిస్తున్నారు. కమర్షియల్ సిలిండర్ రూ.2వేలు ఉంటే.. రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. నిందితుల నుంచి 11 వాహనాలు స్వాధీనం చేసుకున్నాం. ఈ ముఠా సభ్యులకు శంషాబాద్‌లో ఓ గోదాం ఉంది. అప్జల్‌గంజ్‌లో కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. ప్రధాన నిందితుడు మహ్మద్ అమీర్‌ను బంజారాహిల్స్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించాం'' అని డీసీపీ తెలిపారు.

పటాన్‌చెరులో 'మైనింగ్' మాఫియా

- సిట్ విచారణ జరపాల్సిందే!
- కాంగ్రెస్ ఇన్ చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ధ్వజం

విశ్వంభర, సంగారెడ్డి : పటాన్‌చెరు నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ మైనింగ్, భూ కబ్జాలపై కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు ఇన్ చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం రామచంద్రాపురంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే , ఆయన అనుచరుల అక్రమ సంపాదనపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో మైనింగ్ అక్రమాలపై చర్చ జరిగినప్పుడు, వందల కోట్ల రూపాయల అవినీతిని కేవలం 'చిన్న తప్పు'గా చిత్రీకరించడం దురదృష్టకరమని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. మాజీ మంత్రి హరీశ్ రావుకు నిజాయితీ ఉంటే, మధుసూదన్ రెడ్డి వ్యవహారంపై తక్షణమే సీబీసీఐడీ విచారణకు ఆదేశించాలని సవాల్ విసిరారు. పవిత్రమైన చట్టసభలో ప్రజా సమస్యలు పక్కన పెట్టి, అవినీతిపరులకు మద్దతుగా మాట్లాడటం సరికాదన్నారు. నియోజకవర్గంలో సాగుతున్న అక్రమాలను ఆయన వివరించారు, 2023లో 38 క్రషర్ల ద్వారా సుమా రు రూ.380 కోట్ల విలువైన అక్రమ మైనింగ్ జరిగిందని, దీనిపై గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఖాజీపల్లి, కుత్బుల్లాపూర్ సరిహద్దుల్లో ఫైర్ స్టేషన్ పేరుతో రూ.90 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని పేర్కొన్నారు. ఇంద్రేశం పోచారం ప్రాంతాల్లో వేల కోట్ల రూపాయల విలువైన భూములను ఎమ్మెల్యే అనుచరులు కబ్జా చేశారని ధ్వజమెత్తారు. పాసుపుస్తకాలు ఇప్పిస్తామని నమ్మించి 117 మంది పేద రైతుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 2014తో పోలిస్తే ఎమ్మెల్యే ఆస్తులు ఏ స్థాయిలో పెరిగాయో పూర్తిస్థాయి విచారణ చేపట్టాలి. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అభివృద్ధి నిధులను పక్కదారి పట్టించారనీ కాటా శ్రీనివాస్ గౌడ్ ఎద్దేవా చేశారు. లక్డారం ప్రాంతంలో అక్రమ మైనింగ్ బహిరంగంగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ఈ మొత్తం వ్యవహారాలపై ప్రభుత్వం ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అధికారికంగా మంథని ప్రముఖుల జయంతి, వర్ధంతులు

- కౌన్సిల్ లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
- మంథని మున్సిపల్ ఛైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్
- రావికంటి రామయ్య గుప్తకు ఘన నివాళి

విశ్వంభర, మంథని : మంథని: వివిధ రంగాల్లో ప్రతిభ చూపి మంథనికి గర్వకారణమైన ప్రముఖుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను మున్సిపల్ కార్పొరేషన్ తరపున అధికారికంగా నిర్వహించే విషయంలో కౌన్సిల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంథని మున్సిపల్ ఛైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ తెలిపారు. ప్రజాకవి, మంత్రకూట వేమన రావికంటి రామయ్య గుప్తా 17వ వర్ధంతి సందర్భంగా సోమవారం వారి విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. మంథని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను చక్కగా చూసుకోవాల్సిన బాధ్యత సంతానంపై ఉంటుందన్నారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారి వేతనంలో 15% కోత విధించేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చట్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దివంగత ప్రజానేత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని వారి తనయుడు, మంత్రి శ్రీధర్ బాబు ఏటా ఘనంగా చేస్తూ వారి స్ఫూర్తిని చాటుతున్నారని కొనియాడారు. అదే బాటలో రావికంటి రామయ్య గుప్త తనయులు వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఏటా నిర్వహించడం ప్రశంసనీయమన్నారు.రావికంటి రామయ్య గుప్త ఉపాధ్యాయునిగా కవిగా, సమాజానికి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. మంథని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎల్లంకి వంశీధర్ మాట్లాడుతూ మంథనిలో కొలువుదీరిన వైశ్య ప్రముఖులు రావికంటి రామయ్య గుప్తా, గుండా నాగరాజుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఏటా తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు శశి భూషణ్ కాచె, బీజేపీ నాయకుడు బోగోజు శ్రీనివాస్, విశ్రాంత ఉపాధ్యాయుడు పవిత్రం భూమయ్య, మంథని విద్యార్థి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు కొండెల మారుతి, రావికంటి రామయ్య గుప్త తనయుడు, జర్నలిస్ట్ శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. కొమురవెల్లి సమ్మయ్య, ఇల్లెందుల కిషోర్, రావికంటి సదానందం, సతీష్, రేపాల రమేష్, కొంతం రమేష్, రాచర్ల నాగరాజు, దొంతుల రాజేందర్, గుండా హరీష్, శైలజ, చంద్రకాంత్, ఇల్లెందుల సత్యనారాయణ, రాజమౌళి గౌడ్ తదితరులు పాల్గొని రావికంటి రామయ్య గుప్తకు ఘనంగా నివాళులు అర్పించారు.

సర్పంచులకు సన్మానం

విశ్వంభర, రామన్నపేట : ఉమ్మడి నల్గొండ జిల్లాలో రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని పల్లివాడ గ్రామ సర్పంచ్ ఖమ్మంపాటి శ్రీనివాస్, వెల్లంకి గ్రామ సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాస్, సర్నేనిగూడెం గ్రామ సర్పంచ్ గంగదేవి స్వామి లకు సన్మానం చేయడం జరిగింది. రామన్నపేట నియోజకవర్గాన్ని సాధించుకుందామని సర్పంచ్ లతో జరిగిన చర్చలో వారు సానుకూలంగా స్పందించి ఎలాగైనా రామన్నపేటని నియోజకవర్గంగా చూడాలని తమకు ఉందని, తాము కూడా అందులో భాగస్వాములమై సహకరిస్తామని చెప్పారని రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర రమేష్‌గౌడ్ అన్నారు. ఈ సన్మాన కార్యక్రమాలలో పోషబోయిన మల్లేశం, నియోజకవర్గ సాధన సమితి కార్యదర్శి గడ్డం యాదగిరి, ఎండి. ఫజల్, నకరెకంటి అశోక్, బోయిన ఆనంద్, పెండెం రవీందర్, పోచబోయిన మల్లేష్, దండుగుల రాములు, వనం చంద్రమౌళి, శ్రీరామోజీ నరసింహచారి, తదితరులు పాల్గొన్నారు.

రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

విశ్వంభర, హైదరాబాదు : రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ పబ్లిక్, ప్రైవేట్ రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాదు ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12,000 ఆర్థిక సహాయం, ఆదాయం తగ్గిన వారికి నెలకు రూ.4,500 జీవనభృతి ఇవ్వాలని కోరారు. ఇంధన ధరలు, నిర్వహణ ఖర్చులు పెరగడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యాప్ సంస్థల అధిక కమిషన్లు, జరిమానాలు, భద్రతా లోపాలు సమస్యలను తీవ్రతరం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, వృద్ధాప్య పింఛన్ వంటి సదుపాయాల కోసం సంక్షేమ బోర్డు అవసరమని చెప్పారు. డిమాండ్లు అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్.కోటయ్య అధ్యక్షతన కె.సతిష్, వెంకటేశ్వర్లు, క్రీష్ణ, ముఖేష్, రవి, ప్రేమాజి, రాములు, లావణ్య, అసిఫ్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్ ప్రతులు దగ్ధం

విశ్వంభర, చిక్కడపల్లి : కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టియుసిఐ నాయకులు హైదరాబాదు ఆర్టీసీ క్రాస్ రోడ్డులో ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎల్. పద్మ మాట్లాడుతూ, ఈ కోడ్‌లు కార్మిక హక్కులను హరించే చట్టాలని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక యజమానులకు అనుకూలంగా ఉన్న ఈ చట్టాలు కార్మికులకు నష్టం చేస్తాయని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. హన్మేష్ మాట్లాడుతూ, రైతులకు తీసుకొచ్చిన చట్టాల మాదిరిగానే ఇవి కూడా కార్మికులకు నష్టమని విమర్శించారు. తెలంగాణలో ఈ కోడ్‌ల అమలు నిలిపివేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్. నల్లన్న, లక్ష్మీ, సత్యనారాయణ, టి. నారాయణ, మెహర్, కిరణ్, నాగయ్య, సుధాకర్, ఎం. రవికుమార్, బి.ఎస్. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు

విశ్వంభర, రామన్నపేట : యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రం, వాణిజ్యశాస్త్రం, భౌతికశాస్త్రం విభాగాల ఆధ్వర్యంలో "ఉన్నత విద్యలో అభివృద్ధి చెందుతున్న ఆవిష్కరణలు మరియు సమకాలీన పురోగతి" అను అంశం పైన రేపు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం తెలియజేశారు. ఈ సదస్సు ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు ఆచార్య ఇటిక్యాల పురుషోత్తం, కీలకోపన్యాసకులుగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ సిహెచ్.కృష్ణారెడ్డి, గౌరవ అతిథిగా స్థానిక సర్పంచ్ గరికపాటి సత్యనారాయణ హాజరు అవుతారని అన్నారు. అదే విధంగా ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు, ప్రముఖకవి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి , గౌరవ అతిథులుగా కేరళ కేంద్రీయ విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ బండారు రామకృష్ణ, జేఎన్టీయూ అధ్యాపకులు డాక్టర్ సురేష్ శ్రీపాద, చేవెళ్ల డిగ్రీ కళాశాల అధ్యాపకులు ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ఏ మాలిక్ తదితరులు వస్తున్నారని తెలియజేశారు. అంతే కాకుండా ఈ సదస్సులో ఆయా విశ్వవిద్యాలయాల, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు సుమారు 40 మంది పాల్గొని పత్ర సమర్పణ చేస్తారని తెలియజేశారు. సదస్సు నిర్వాహకులు డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, డాక్టర్ జె.చిన్నబాబు, డాక్టర్ జి.సునీత మాట్లాడుతూ, ఒకరోజు జరిగే ఈ జాతీయ సదస్సులో పరిసర ప్రాంతాలలోని ఆయా కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వీధి వ్యాపారుల చట్టం దేశవ్యాప్తంగా అమలు చేయాలి

విశ్వంభర, బాగ్ లింగంపల్లి : వీధి వ్యాపారుల చట్టాన్ని దేశవ్యాప్తంగా సమర్థంగా అమలు చేయాలని తెలంగాణ స్ట్రీట్ హాకర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సి హెచ్ సతీష్ గౌడ్ అన్నారు. హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశానికి అధ్యక్షత వహించారు. వివిధ రాష్ట్రాల్లో వీధి వ్యాపారుల అక్రమ తొలగింపులు, చట్ట అమలులో లోపాలపై చర్చించి, సంక్షేమం కోసం జాతీయ స్థాయి పోరాటానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో రాజేష్ గురునాని (బీహార్), మహేశ్వర్ బాల్, ప్రీతమ్ సింగ్ (ఒడిశా), అన్వర్ షీరీట్ (కర్ణాటక) , దయ్యాల శ్రీనివాస్, లుధియా, రమేష్ కుమార్, కుమార్, రఫీక్, విశాల్ సింగ్, భూదేవి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ఉజ్జ్వల, ప్రజ్వలల నూతన వస్త్ర వేడుక

విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ పట్టణంలోని వీఆర్ఎన్ గార్డెన్స్ లో శనివారం పిల్లి సుధాకర్, రామశ్రీ దంపతుల కుమార్తెలు ఉజ్జ్వల, ప్రజ్వలల నూతన వస్త్రాలంకరణ వేడుక ఘనంగా జరిగింది.ఈ వేడుకకు గోపా డివిజన్ అధ్యక్షులు, సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత సమ్మయ్య గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఉజ్జ్వల, ప్రజ్వలలను ఆయన ఆశీర్వదించి, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.ఇంకా ఈ వేడుకకు రాజకీయ ప్రముఖులు, మాజీ శాసన సభ్యులు, మాజీ ఎంపీ లు , వివిధ కులసంఘాల పెద్దలు హాజరయ్యారు.

ప్రైవేట్ ఇన్సూరెన్స్‌కు స్కీములు ఇవ్వొద్దు: ఏఐటీయూసీ

విశ్వంభర, హిమాయత్ నగర్ : భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించే జీవో నెం.12ను సవరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల రాజు డిమాండ్ చేశారు.సోమవారం హైదరాబాదు హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ పథకాలను బోర్డు ద్వారానే అమలు చేయాలని, సహజ మరణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, సిఎస్ఆర్ హెల్త్ టెస్టులను రద్దు చేయాలని కోరారు. కార్మికుల నిధులను ప్రైవేట్ కంపెనీలకు మళ్లించడం అన్యాయమని విమర్శించారు. పెండింగ్ పరిహారాలు వెంటనే చెల్లించి, హెల్త్ కార్డులు జారీ చేయాలని సూచించారు. సమావేశంలో ఎం ప్రవీణ్ కుమార్, ఏం నరసింహ, పల్లా దేవేందర్ రెడ్డి, ఎండి ఇమ్రాన్, గన్నార రమేష్, కమతం యాదగిరి, ఎస్ మల్లేష్, జీ పరమేష్, పి సమ్మయ్య, కే నరసింహారెడ్డి, వి మల్లికార్జున్, కే వెంకటేష్, శివశంకర్ పాల్గొన్నారు.